# మైనింగ్ మాఫియాపై పార్లమెంటులో ప్రస్తావిస్తాం: కారత్



తన నివాసంలో ప్రకాశ్‌కారత్‌ని సన్మానిస్తున్న చంద్రబాబు

హైదరాబాద్, న్యూస్‌టుడే: అక్రమ మైనింగ్ అంశం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల్లో జరుగుతున్న పరిణామాలను గురువారం నుంచి ప్రారంభం కానున్న పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రస్తావిస్తామని సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ తెలిపారు. అధిక ధరలు, కరవుపైనా చర్చించి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు హైదరాబాద్ వచ్చిన ఆయన.. తెదేపా అధినేత చంద్రబాబు ఆహ్వానం మేరకు బుధవారమిక్కడ ఆయన నివాసంలో అల్పాహార విందు భేటీకి హాజరయ్యారు. తెదేపా సీనియర్లు నామా నాగేశ్వరరావు, ఎర్రన్నాయుడు, యనమల, కంభంపాటి రామ్మోహన్ రావు, రమేష్ రాథోడ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. పార్లమెంటు సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలతోపాటు, దేశంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై వీరి మధ్య చర్చ జరిగింది. అనంతరం కారత్ మాట్లాడుతూ.. మైనింగ్ మాఫియాపై తెదేపాతో కలిసి పోరాడతామని చెప్పారు. చెరకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా తమ మధ్య చర్చ జరిగిందని చంద్రబాబు వెల్లడించారు. వారి సమస్యల పరిష్కారానికి తాము ప్రభుత్వాన్ని నిలదీస్తామని చెప్పారు. ఓఎంసీ అక్రమాలపై సీబీఐ విచారణ వేసి చేతులు దులుపుకొందామంటే కుదరదని చంద్రబాబు పేర్కొన్నారు. సీబీఐ విచారణ పూర్తయ్యేవరకు మైనింగ్ లీజులన్నీ రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

**ఉద్యమాలకు సిద్ధమవండి:** సీపీఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కారత్ పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను రాష్ట్ర నేతలకు వివరించారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్ర కార్యదర్శివర్గంతో భేటీ అయిన ఆయన బుధవారం రాష్ట్ర కమిటీ సమావేశంలో మాట్లాడారు. అధిక ధరలు, వరదలు, కరువు పరిస్థితుల నేపథ్యంలో ప్రజా సమస్యలపై జాతీయస్థాయి ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధం కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో గనుల అక్రమ తవ్వకాలు, రాజకీయాలపై మైనింగ్ మాఫియా ప్రభావం గురించి రాష్ట్ర కమిటీ చర్చించింది.